ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

5

శ్రీకాకుళం

జిల్లా వార్తలు

మంగళవారం 12 మార్చి 2024





వంశధార నదిలో శ్రీముఖలింగేశ్వరుడికి చక్రతీర్థ స్నానం

వంశధార తీరం.. భక్తజన సంద్రం



శ్రీముఖలింగేశ్వరుడి చక్రతీర్థ వేడుకలకు హాజరైన భక్తులు

- వైభవంగా శ్రీముఖలింగేశ్వరుడి చక్రతీర్థం

జలుమూరు/ఎల్.ఎన్.పేట, మార్చి 11: శ్రీముఖలింగం భక్తజనంతో పులకించింది. వంశధార తీరంలో శివనామస్మరణ మార్మోగింది. మహా శివరాత్రి ముగింపు ఉత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీముఖలింగేశ్వరుడు పార్వతీ సమేతంగా ఎల్.ఎన్.పేట మండలం మిరియాపల్లి రేవులో చక్రతీర్థ స్నానమాచరించాడు. ఈ అద్భుత దృశ్యాన్ని తిలకించేందుకు జిల్లాతోపాటు విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, ఒడిశా నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చారు. శ్రీముఖలింగంలో సోమవారం వేకువజామునుంచే స్వామి దర్శనానికి బారులు దీరారు. ఆలయ ప్రాంగణమంతా శివనామస్మరణతో మార్మోగింది. మధ్యాహ్నం 12గంటల నుంచి ఆలయంలో దర్శనాలను నిలిపేశారు. అనంతరం పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ మూర్తులను మంగళవాయిద్యాల నడుమ నందివాహనంపై ఆశీనులను చేశారు. దేవదాయశాఖ ఏసీ ప్రసాద్ పట్నాయక్, ఎస్పీ జీఆర్ రాధిక ఆధ్వర్యంలో గ్రామోత్సవం ప్రారంభించారు. వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ నందివాహనంపై శ్రీముఖలింగేశ్వరుడి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా మిరియాపల్లి రేవు వద్దకు తీసుకువెళ్లారు. మిరియాపల్లికి చెందిన నాయుడు కుటుంబ సభ్యులు పాలభిషేకం చేసి స్వామికి నూతన వస్త్రాలను అలంకరించారు. సంప్రదాయ బద్ధంగా వంశధార నదిలో ఉత్సవ మూర్తులకు చక్రతీర్థ స్నానాలు చేయించారు. ఈ సమయంలో భక్తజనం శివనామస్మరణతో పులకించింది. యువకులు వంశధార నదిలో ఫిరమిడ్ ఆకారంలో విన్యాసాలు చేశారు. నదీ తీరాన కొంతమంది పితృదేవతలకు పూజలు చేయించారు. భక్తుల రాకతో దబ్బపాడు, మిరియాపల్లి, వాడవలస, లక్ష్మీనర్సుపేట గ్రామాల్లో వీధులు, రహదారులు కికిటలాడాయి. ఈ గ్రామాల్లో కూడళ్ల వద్ద ట్రాఫిక్ రద్దీ నెలకొంది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్పీ రాధిక, టెక్కలి ఎస్పీ బాలచంద్రారెడ్డి నేతృత్వంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. మరోవైపు దేవదాయశాఖ ఏసీ ప్రసాద్ పట్నాయక్, డిప్యూటీ తహసీల్దార్ పి.శ్రీనివాసరావు పాలక మండలి అధ్యక్షుడు బసవ రమణమూర్తి పర్యవేక్షించారు. సత్యసాయి సేవా సమితి(కొమనాపల్లి) సభ్యులు, పలు స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు సేవలతో పాటు ప్రసాదాలు పంపిణీ చేశారు. శ్రీముఖలింగం శివారులోను, నగిరికటకంలోను అన్నదానం చేశారు.

ట్రాఫిక్ ఇక్కట్లు

చక్రతీర్థ స్నానం అనంతరం మధ్యాహ్నం 2గంటలకు ఉత్సవమూర్తులను మళ్లీ నంది వాహనంపై ఆశీనులను చేసి.. శ్రీముఖలింగం గర్భగుడికి తిరుగు పయనమయ్యారు. ఈ సమయంలో శ్రీముఖలింగం నుంచి నగరికటకం వరకు సుమారు గంటపాటు ట్రాఫిక్ స్తంభించిపోయింది. వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. అలాగే ఆర్టీసీ కూడా భక్తులకు సరిపడా బస్సులు కేటాయించకపోవడంతో అవస్థలు పడ్డారు. ఆటోలు, ప్రైవేటు వాహనాలను ఆశ్రయించారు.

ఎన్నికల విధుల్లో పొరపాట్లకు తావివ్వొద్దు

- కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్



మాట్లాడుతున్న కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

కలెక్టరేట్, మార్చి 11: సార్వత్రిక ఎన్నికల విధులపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని, ఎటువంటి పొరపాట్లకు తావివ్వొద్దని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ సూచించారు. సోమవారం స్థానిక అంబేడ్కర్ ఆడిటోరియంలో ఆర్వో, ఈఆర్వోలు, నోడల్ అధికారులు, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, ఎంసీసీ, వీఎస్టీ, కలెక్టరేట్ సెక్షన్ అధికారులకు నిర్వహించిన శిక్షణలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో వినియోగించే మానవ శక్తి ప్రణాళిక, వారికి తగిన శిక్షణ, పరికరాల నిర్వహణ, రవాణా వ్యవస్థల పర్యవేక్షణ తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. 'ఎన్నికల బాధ్యతల్లో ఉన్నవారంతా అంకితభావంతో పనిచేయాలి. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి సంబంధించి ఎలాంటి పొరపాట్లకు అవకాశం ఇవ్వవద్దు. అభ్యర్థుల ఎన్నికల ఖర్చుకు సంబంధించి వ్యయ పర్యవేక్షణలో సమన్వయంతో పనిచేయాలి. పార్లమెంట్ అభ్యర్థులు రూ.95లక్షలు, అసెంబ్లీ అభ్యర్థులు రూ.40లక్షల వరకు మాత్రమే ఖర్చు చేసేందుకు ఎన్నికల కమిషన్ నిర్ణయించింది. పోస్టల్ బ్యాలెట్ విషయంలో ఎన్నికల విధుల్లో ఉన్న వారంతా కచ్చితంగా, సులభంగా, సౌకర్యవంతంగా ఓటు వేసేలా ప్రణాళిక రూపొందించాలి. బుధవారం నాటికి ఎన్నికల విధులకు సంబంధించిన వారంతా తమ ఓటు గుర్తింపు కార్డు కాపీని సంబంధిత నోడల్ అధికారికి అందజేయాల'ని కలెక్టర్ ఆదేశించారు. జేసీ ఎం.నవీన్ మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో గుర్తించిన ఇబ్బందులు ఏవైనా ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తేవాలని, ఎన్నికల విధులతో సంబంధం లేని వ్యక్తులతో ఈ అంశాలపై చర్చించరాదన్నారు. కమిషన్ సూచనలు పాటించాలని, మద్యం, డబ్బు, ఇతర ప్రలోభాల నియంత్రణకు నిఘా బృందాలు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్‌కమర్, డీఆర్వో ఎం.గణపతిరావు, నోడల్ అధికారులు, ఆర్వోలు, ఈఆర్వోలు, ఎన్నికల విధులు కేటాయించిన అధికారులు పాల్గొన్నారు.

గూడ్సురైలు ఓవర్‌షూట్

- పలాస పరిధిలో రైళ్ల రాకపోకలకు అంతరాయం



క్లాంపులు వేస్తున్న దృశ్యం



పలాస రైల్వేస్టేషన్‌లో నిరీక్షిస్తున్న ప్రయాణికులు

టెక్కలి, మార్చి 11: ఈస్ట్‌కోస్ట్ రైల్వే ఖుర్దా డివిజన్ తాళభద్ర గేటు దాటగానే పలాస రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం వేకువజామున ఖుర్దా నుంచి వస్తున్న ఓ గూడ్సురైలు ఓవర్‌షూట్ (రెడ్‌సిగ్నల్ దాటి) అయింది. నాలుగు గంటల పాటు రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగింది. గూడ్స్ ఓవర్‌షూట్ కావడంతో 59బి పాయింట్‌ను ఇంజన్ దాటి నడిచింది. దీంతో అప్పటికే పలాస నుంచి కటక్ బయలుదేరిన డీఎంయూ రైలు పట్టాలపై నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న క్యారేజ్ అండ్ వేగన్ సిబ్బంది, ట్రాక్ సెక్షన్, ఆపరేటింగ్, లోకో, సిగ్నలింగ్ వ్యవస్థలు, స్టేషన్ సూపరింటెండెంట్ మొత్తం సిబ్బందితో హుటాహుటిన అక్కడకు చేరుకొని పరిస్థితిపై ఆరాతీశారు. ఈకో రైల్వే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మూడున్నర గంటలు తరువాత 59బి పాయింట్ వద్ద తాళం తెరిచి మాన్యువల్ పాయింట్‌ద్వారా క్లాంపులకు లాక్‌చేసి రూట్ రిలీజ్‌కు కుస్తీలు పడ్డారు. అప్పటికే శ్రీకాకుళం నుంచి భువనేశ్వర్ వైపు వెళ్లే హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్, అహ్మదాబాద్-పూరీ ఎక్స్‌ప్రెస్, విశాఖ-తాల్చేర్, సికింద్రాబాద్ హౌరా ఈస్ట్‌కోస్ట్ తదితర రైళ్లన్నీ ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. అలాగే మందస నుంచి పలాస వైపు వచ్చే డీఎంయూ రైలు సేవలకు కూడా 4గంటల పాటు అంతరాయం కలిగింది. పలాస రైల్వేస్టేషన్ పరిధిలో రైళ్ల రాకపోకలకు సంబంధించి అసలు ఏమి జరుగుతుందో తెలియక ప్రయాణికులు అవస్థలు పడ్డారు. పలు రైళ్లు ఔటర్‌లోను, మరి కొన్ని ఇతర రైల్వేస్టేషన్లలోను నిలిచి పోవడం.. స్టేషన్ మేనేజర్ కూడా అందుబాటులో లేకపోవడంతో అసహనం చెందారు. మాన్యువల్ విధానంతో క్లాంపులు వేసిన తరువాత గూడ్సు రైలును వెనక్కి పంపించడంతో రైళ్ల రాకపోకలకు మార్గం సుగమమైంది. అయితే గూడ్సురైలు ఓవర్‌షూట్ కావడం పైలెట్ నిర్లక్ష్యమా, సాంకేతిక లోపమా? అన్నది తేలాల్సి ఉంది.

పోలీసుస్టేషన్ ఆవరణలోనే..



స్టేషన్ ఆవరణలో కొట్లాటకు దిగిన వైసీపీ నాయకులను చెదరగొడుతున్న పోలీసులు

వైసీపీ అరాచకం

అది కాశీబుగ్గ పోలీసుస్టేషన్ ఆవరణ. పోలీసు అధికారులు, సిబ్బంది ఉన్నారు. వారి ఎదుటే అధికారపార్టీ నాయకులు రెచ్చిపోయారు. ఇద్దరు టీడీపీ కార్యకర్తలపై దాడి చేశారు. అంతకుముందు మంత్రి సీదిరి సమక్షంలోనే అంగన్‌వాడీ కార్యకర్తపైనా దాడికి తెగబడ్డారు. ఇదేమని ప్రశ్నించిన ఆమె భర్త, కుమారుడిపైనా దౌర్జన్యం చేశారు. పైగా తమపైనే వారు దాడిచేసినట్లు పోలీసుకు ఫిర్యాదు చేశారు. వైసీపీ నాయకుల దాష్టీకంపై టీడీపీ నేతలు తీవ్రంగా మండిపడ్డారు. పోలీసుస్టేషన్‌లోనే భద్రత లేకపోతే శాంతిభద్రతల పరిస్థితి ఏంటని వారు ప్రశ్నించారు.

- ఇద్దరు టీడీపీ కార్యకర్తలను రక్తమోడేలా కొట్టిన వైనం
- అంతకుముందు అంగన్‌వాడీ కార్యకర్తపైనా దాడి
- ప్రశ్నించిన ఆమె భర్త, కుమారుడుపై కూడా దౌర్జన్యం
- పోలీసుస్టేషన్‌కు వచ్చిన టీడీపీ నాయకురాలు శిరీష
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్
- మూడురోజుల్లో సమస్య పరిష్కరిస్తామన్న పోలీసులు

పలాస/రూరల్, మార్చి 11: పలాస మండలం బంటుకొత్తూరుకి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త రాగోలు అప్పలనర్సమ్మను ఐదేళ్లుగా స్థానిక వైసీపీ నాయకులు వేధింపులకు గురి చేస్తున్నారు. భర్త నీలకంఠ టీడీపీ బీసీ కార్యదర్శి కావడమే ఆమె చేసిన నేరం. కొద్దిరోజుల కిందట అంగన్‌వాడీ కేంద్రాన్ని స్థానిక వైసీపీ నేతలు సందర్శించారు. ఆ సమయంలో సొంత పనిపై బయటకువెళ్లిన అప్పలనర్సమ్మ కేంద్రంలో లేరు. దీంతో ఆమెపై వైసీపీ నాయకులు ఫిర్యాదు చేయగా.. విచారణ చేయకుండా అధికారులు నోటీసులు జారీచేశారు. దీనిని ఆమె తప్పుపట్టారు. ఈ క్రమంలో సోమవారం మంత్రి సీదిరి అప్పలరాజుతో బ్రాహ్మణతర్లా సచివాలయ భవనాన్ని వైసీపీ నేతలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి అంగన్‌వాడీ కార్యకర్త అప్పలనర్సమ్మ రాగా.. రికార్డులు తీసుకురావాలని వైసీపీ నేతలు ఆదేశించారు. ఈ మేరకు రికార్డులు తెచ్చిన అప్పలనర్సమ్మపై వైసీపీ నాయకులు దాడి చేసి.. అమర్యాదగా ప్రవర్తించారు. దీంతో ఆమె వైసీపీ నాయకులకు, మంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ముగ్గురు వైసీపీ నాయకులు దాడి చేయడంతో.. ఇదేమి అన్యాయమని ప్రశ్నించిన అప్పలనర్సమ్మ భర్త నీలకంఠ, సాయికిరణ్‌పై కూడా దాడి చేశారు. దీంతో వారు పోలీసుస్టేషన్‌కు వచ్చి తమకు న్యాయంచేయాలని ఫిర్యాదు చేశారు.

- ఇదిలా ఉండగా తమపైనే అంగన్‌వాడి కార్యకర్త కుటుంబం దాడికి దిగిందని బంటుకొత్తూరు సర్పంచ్ పిట్ట షణ్ముఖరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయనకు సంఘీభావంగా పలాస మండలం, మునిసిపాలిటీకి చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో చేరడంతో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. విషయం తెలుసుకుని టీడీపీ నేతలు కూడా పోలీసుస్టేషన్‌కు చేరుకోవడంతో ఇరువర్గాలూ బయటకు వెళ్లిపోవాలని పోలీసులు చెప్పారు. సమస్య సద్దుమణుగుతున్న సమయంలో అంగన్‌వాడీ కార్యకర్త కమారుడు సాయికిరణ్‌పై వైసీపీ కార్యకర్తలు కర్రలు, క్రికెట్ బ్యాట్‌తో పోలీసుల ఎదురుగానే దాడికి దిగడంతో మళ్లీ ఉద్రిక్తత నెలకొంది. మంచినీటి కోసం బయటకు వెళ్లిన చైతన్య అనే టీడీపీ కార్యకర్తపై కూడా వైసీపీ నాయకులు దాడికి దిగడంతో పోలీసులు వారందరినీ వెళ్లిపోవాలని ఆదేశించారు. పోలీసుస్టేషన్ వద్దే టీడీపీ కార్యకర్తలపై వైసీపీ నాయకులు దాడి చేయడం చర్చనీయాంశంగా మారింది. అలాగే స్టేషన్ వద్ద కవరేజ్‌కు వెళ్లిన విలేకరులపై పోలీసులు, వైసీపీ కార్యకర్తలు వీరంగం సృష్టించారు. దీనిపై విలేకరులు సర్దిచెబుతున్నా పట్టించుకోకపోవడం గమనార్హం.

బాధితులకు అండగా ఉంటాం

టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష కాశీబుగ్గ పోలీసుస్టేషన్‌కు చేరుకుని బాధితులను ఓదార్చారు. బాధితులకు జరిగిన అన్యాయాన్ని తెలుసుకుని ఆమె కూడా కన్నీటి పర్యంతమయ్యారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సీఐ విజయానంద్‌ను కలిసి బాధితులకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. అనంతరం విలేకరులతో శిరీష మాట్లాడుతూ.. 'వైసీపీ నాయకులు ఉద్దేశపూర్వకంగా దాడులు చేసి భయోత్పాతాన్ని సృష్టిస్తున్నారు. ఎంపీపీ తండ్రి.. ఎంపీపీ సీటులో కూర్చొని అధికారులకు, పోలీసులకు మేనేజ్ చేస్తున్నారు. అధికారదర్పాన్ని ప్రదర్శిస్తూ టీడీపీ నాయకులపై రౌడీయిజం చేస్తున్నారు' అని ఆరోపించారు. 'గ్రామంలో ఉద్రిక్తత తలెత్తకుండా రక్షణ కల్పించాలని పోలీసులను కోరాం. మూడురోజుల్లో టీడీపీ కార్యకర్తలతోపాటు అంగన్‌వాడీ కార్యకర్త కుటుంబానికి పోలీసులు న్యాయం చేస్తామన్నారు. లేదంటే పోలీసుస్టేషన్ వద్దే ఆందోళన చేస్తామ'ని గౌతు శిరీష స్పష్టం చేశారు. పోరాటం తప్పదని హెచ్చరించారు. ఆమె వెంట రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, పీరుకట్ల విఠల్, లొడగల కామేశ్వరరావుయాదవ్, గాలి కృష్ణారావు, గురిటి సూర్యనారాయణ, బడ్డ నాగరాజు, యవ్వారి మోహనరావు, సప్ప నవీన్, ఎ.రామకృష్ణ, సూరాడ మోహనరావు ఉన్నారు.



పోలీసుస్టేషన్ వద్ద మాట్లాడుతున్న గౌతు శిరీష, పక్కన అంగన్‌వాడీ కార్యకర్త అప్పలనర్సమ్మ



కాలువ పైకప్పులుగా.. జగనన్న హద్దురాళ్లు

రాష్ట్ర ప్రభుత్వం జగనన్న భూసర్వే పేరుతో రూ.కోట్లు ఖర్చు చేయగా.. ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో కొన్ని గ్రామాల్లో ఈ ప్రక్రియ నిలిచిపోయింది. జిల్లాలో భూముల హద్దుల కోసం ప్రభుత్వం ఓ అధికారపార్టీ నాయకుడు గ్రానైట్ క్వారీ నుంచి సరిహద్దు రాళ్ల కొనుగోలు చేసింది. భూ సర్వే మాట ఎలా ఉన్నా ఈ హద్దురాళ్లను అధికారులు ప్రతి గ్రామంలో వందల సంఖ్యలో కుప్పలు తెప్పలుగా పడేశారు. దీంతో సరుబుజ్జిలి మండలం గోనిపాడులో ప్రజలు ఇలా వీధికాలువపై హద్దురాళ్లను వేస్తూ వినియోగిస్తున్నారు. - సరుబుజ్జిలి



చేయూత సభలో నిర్బంధం

- గేట్లు దూకి వెనుదిరిగిన మహిళలు

శ్రీకాకుళం పీఎస్ఎన్ఎమ్‌హెచ్ స్కూల్ మైదానంలో సోమవారం నిర్వహించిన 'చేయూత' కార్యక్రమంలో మహిళలను నిర్బంధించారు. మధ్యాహ్నం 3 గంటలకు సమావేశమని చెప్పి వైసీపీ నాయకులు, వలంటీర్లు, మహిళా సంఘాల ప్రతినిధులు.. మహిళలను సభా ప్రాంగణానికి తరలించారు. అయితే మంత్రి ధర్మాన ప్రసాదరావు అనుకున్న సమయానికన్నా రెండు గంటలు ఆలస్యంగా వచ్చారు. దీంతో కొంతమంది మహిళలు విసిగిపోయి.. మంత్రి హాజరయ్యే సమయానికి తిరుగు ముఖం పట్టారు. స్థానిక మహిళా సంఘాల నాయకులు, వైసీపీ కార్యకర్తలు స్కూల్ గేట్లకు తాళాలు వేసి మహిళలను నిర్బంధించారు. అయినప్పటికీ కొంతమంది మహిళలు గేట్లు దూకి వెళ్లిపోయారు. మరికొంతమంది స్కూల్ వెనుక ఖాళీ స్థలం నుంచి బయటకు జారుకున్నారు.

- శ్రీకాకుళం అర్బన్

వైభవం.. చక్రతీర్థం

మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో స్వామి వారి చక్రతీర్థ స్నానాలు ఘనంగా నిర్వహించారు. వందలాది మంది భక్తులు పాల్గొని తరించారు.

వందలాది మంది భక్తుల సమక్షంలో..

హిరమండలం: హిరమండలం చిన్న కోరాడ వీధిలోని ఉమారుద్ర కోటేశ్వర స్వామి వారి చక్రతీర్థ స్నానం సోమవారం వంశధార నదిలో ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం శివ పార్వతుల ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువెళ్లి వేద మంత్రాల నడుమ చక్రతీర్థ స్నానం చేయించారు. అనంతరం విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వేలాది మంది తరలివచ్చి పవిత్ర స్నానాలు ఆచరించి పునీతులయ్యారు. వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ ప్రతి నిధులు అన్నప్రసాద వితరణ చేపట్టారు.


హిరమండలం: చక్రతీర్థ స్నానానికి నంది వాహనంపై తీసుకువెళుతున్న దృశ్యం

కుంటిభద్రలో..

కొత్తూరు: కుంటిభద్ర గ్రామంలో వెలసిన మల్లికార్జున స్వామికి సోమవారం చక్రతీర్థ స్నానాలు నిర్వహించారు. ఉత్సవ మూర్తులను పల్లకిపై వేంచేపు చేసి వంశధార నదికి తీసుకువచ్చి చక్రతీర్థ స్నానాలను వేద ఘోష నడుమ కన్నుల పండువగా చేపట్టారు. కుంటిభద్రతో పాటు పరి సర గ్రామాల ప్రజలు ఆ సమయంలో పవిత్ర స్నానాలను ఆచరించి స్వామిని దర్శించుకున్నారు.

రావివలసలో..

టెక్కలి: రావివలస ఎండల మల్లికార్జునస్వామి తిరువీధి ఉత్సవం సోమవారం మేళతాళాలు, వేద మంత్రాల నడుమ ఘనంగా నిర్వహించారు. స్వామి ఉత్సవ మూర్తులను సీతకోనేరుకు తీసుకువచ్చి చక్రతీర్థ స్నానాలను ఆచరింపజేశారు. కార్యక్రమంలో ఈవో రాధాకృష్ణ, చైర్మన్ సర్లాన సుధాకర్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పాతపట్నంలో..

పాతపట్నం: స్థానిక నీలకంఠేశ్వరుడు, శ్రీకేదారీశ్వరుని చక్రతీర్థ స్నానాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఉత్సవ విగ్రహాలను గ్రామంలో తిరువీధి నిర్వహించిన అనంతరం స్థానిక మహేంద్ర తనయ నదిలో భక్తజన సందోహం మధ్య అర్చకులు విశేష పూజలు చేసి, చక్రతీర్థ స్నానం చేయించారు.

పురుషోత్తపురంలో...

సరుబుజ్జిలి: మండలంలోని పురుషోత్తపురంలో సోమవారం వంశధార నదిలో చక్రతీర్థ స్నానాలు నిర్వహించారు. గ్రామంలోని ఉమా రామలింగేశ్వరస్వామి వారికి మహాశివరాత్రిని పురస్కరించుకుని మూడు రోజులుగా ప్రత్యేక పూజలతో పాటు పాడ్యమి సందర్భంగా స్వామి వారికి వంశధార నదిలో చక్రతీర్థ స్నానం నిర్వహించారు. పురోహితులు గంగవరపు వాసుశర్మ, చంటి శర్మ, ఉమారామలింగేశ్వర దేవస్థానం నుంచి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా నదికి తీసుకెళ్లి చక్రతీర్థం స్నానం చేశారు.

కేకేరాజపురంలో...

బూర్జ: మండలంలోని కేకే రాజపురంలో ఉమాధరాంబికేశ్వర స్వామి వారి చక్రతీర్థ స్నానాలు సోమవారం వైభవంగా నిర్వహించారు. వేద పండితుడు కేశవశర్మ, ఆలయ పూజారి వారణాసి నందికేశ్వరరావు మంత్రోచ్చారణలు, మేళతాళాలతో ఏపీపేట సర్పంచ్ కొరికాన వెంకట శివసాయి, సీతారామరాజు ఆధ్వర్యంలో చక్రతీర్థ స్నానాలు నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా లింగాభరణం

జలుమూరు: మహాశివరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా శ్రీముఖలింగంలోని ముఖలింగేశ్వర స్వామికి సోమవారం రాత్రి లింగా భరణం కార్యక్రమం నిర్వహించారు. స్వామి చక్రతీర్థ స్నానం ముగిసిన అనంతరం దేవదాయశాఖ అధికారుల ఆధ్వర్యంలో అర్చకులు విశేష పూజలు చేశారు. బియ్యంతో స్వామికి అభిషేకం చేసి బంగారు ఆభర ణాలు అలంకరించారు. కార్యక్రమంలో ఈవో పి.ప్రభాకరరావు, ఆలయ ధర్మకర్త పర్లాకిమిడి రాజావారి అర్చకులు శరత్‌చంద్ర పాడి, అర్చకులు ప్రభాకరరావు, సింహాచలం, శ్రీకృష్ణ, నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.


లింగానికి బియ్యంతో అభిషేకిస్తున్న అర్చకులు


పాతపట్నం: నీలకంఠేశ్వరునికి చక్రతీర్థం దృశ్యం


కొత్తూరు: మల్లికార్జునస్వామి ఉత్సవ మూర్తులను తీసుకువస్తున్న దృశ్యం


టెక్కలి: రావివలసలో ఎండల మల్లన్న తిరువీధి ఉత్సవం


సరుబుజ్జిలి: చక్ర తీర్థ స్నానాలు చేస్తున్న అర్చకులు, భక్తులు


బూర్జ: చక్రతీర్థ స్నానాలు చేయిస్తున్న అర్చకులు, భక్తులు

వైసీపీ నేతల మూకుమ్మడి రాజీనామాలు

పాతపట్నం: వైసీపీ జిల్లా కోశాధికారి లోతుగెడ్డ తులసీ వరప్రసాద్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేయడంతో ఆయన వర్గీయులు, ఆ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు రేగేటి షన్ముఖ రావు ఆధ్వర్యంలో పలువురు నేతలు, కార్యకర్తలు ఆ పార్టీకి మూకుమ్మడిగా రాజీనామా చేశారు. ఈ మేరకు సోమవారం స్థాని కంగా ఉన్న క్యాంపు కార్యాలయంలో సమావేశమై పార్టీ ఆవిర్భావం నుంచి తులసీవరప్రసాద్ పార్టీ బలో పేతానికి కృషి చేశారని, ఆయనను సస్పెండ్ చేయడం బాధగా ఉందని, అందువల్ల ఆయనకు మద్దతుగా రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. నియోజకవర్గంలో 22 గ్రామాల్లో ఎమ్మెల్యే రెడ్డి శాంతిని పర్యటించకుండా స్థానికులు అడ్డుకున్నారని, దీనిని పార్టీ అధిష్ఠానం గుర్తించాలని వారు పేర్కొన్నారు. ఎమ్మెల్యే కక్షసాధింపు చర్యలను తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. రాజీనామా చేసిన వారిలో గొర్లె ప్రభా కర్, సర్పంచ్‌ల సంఘ మాజీ అధ్యక్షుడు మజ్జి భుజంగరావు, వెలమ సంఘ డైరెక్టర్ ప్రతినిధి గంగు వాసు, బుగత జోగారావు, డోల ఆనంద్ తదితరులున్నారు.

మొండి బకాయిలపై దృష్టి సారించాలి

నరసన్నపేట: మేజర్ పంచాయతీలో ఇంటి పన్ను మొండి బకాయిలపై దృష్టిసారించాలని పంచాయతీ వార్డు సభ్యులు కోరారు. సోమవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ శంకరరావు అధ్యక్షతన పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఇంటి పన్ను లక్షల్లో బకాయిలు ఉండడంపై సభ్యులు అధికారులను నిలదీశారు. పంచాయతీ ఆదాయం పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. పంచాయతీ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలన్నారు. అనుమతులు లేకుండా ఇళ్ల నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఈవో చిన్నారావు, వార్డు సభ్యులు కోరాడ చంద్రభూషణగుప్త, శర్మ, ఆర్.శ్రీధర్, గొలివి రామారావు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

పలాసరూరల్/వజ్రపుకొత్తూరు: పంచాయతీల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. బ్రాహ్మణతర్లా, బంటుకొత్తూరు, తర్లాకోటల్లో సచివాలయాలు, వజ్రపుకొత్తూరు మండలం అక్కుపల్లి పీహెచ్‌సీ భవనాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీలు ఉంగ ప్రవీణ, నీలవేణి, సర్పంచ్‌లు బాడాన పుష్ప, రామలింగం,కొర్ల సంతోష్, పీఏసీఎస్ అధ్యక్షుడు పైల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

దేశ నిర్మాణంలో ఇంజనీర్ల పాత్ర కీలకం

టెక్కలి: దేశ నిర్మాణంలో ఇంజనీర్ల పాత్ర కీలకమని రాష్ట్ర మెట్రో రైల్ ఎండీ ఎంజేఎం రావు అన్నారు. ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో 'సస్టైనబుల్ అండ్ రెసిలియంట్ సివిల్ ఇంజనీరింగ్ ప్రాక్టీ సెస్' అనే అంశంపై సోమవారం సదస్సు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శరవేగంగా మారుతున్న సాంకేతిక అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని అధ్యాపకులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ కావడంతో పాటు విద్యార్థులను ఆ దిశలో తీర్చిదిద్దాలన్నారు. డైరెక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఈ సదస్సు ఈనెల 16 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎల్ఎల్ నాయుడు, రీసోర్స్‌పర్సన్ ప్రొఫెసర్ కె.శ్రీనివాసరావు, ఎస్.బాల ప్రసాద్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ డి.విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఊకలోడుతో ట్రాఫిక్‌కు ఇబ్బందులు

టెక్కలి: టెక్కలి పాత బస్టాండ్ ప్రాంతంలో సోమవారం ఊకలోడుతో వెళుతున్న వాహనం ఇరుక్కో వడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. పోర్టు వాహనాలు ఓవైపు, ఊకలోడు వాహనం మరో వైపు అడ్డంగా ఉండి పోవడంతో ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు.


వీధిలోకి వచ్చిన ఊకలోడు వాహనం

రిగ్గింగ్ చేసి దువ్వాడను గెలిపిద్దాం

● కార్యకర్తల సమావేశంలో వైసీపీ జడ్పీటీసీ వ్యాఖ్యలు

సంతబొమ్మాళి, మార్చి 11: టెక్కలి వైసీపీ అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్‌ను రిగ్గింగ్ చేసి గెలిపిద్దామని వైసీపీకి చెందిన జడ్పీటీసీ పాల వసంతరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం సంతబొమ్మాళి లో జరిగిన వైసీపీ కార్యకర్తల సమావేశానికి శ్రీకాకుళం వైసీపీ ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్, టెక్కలి అసెంబ్లీ అభ్యర్థి, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ మాట్లాడుతూ 'పోలింగ్ జరిగే రోజు ఉదయం 9 గంటల కల్లా నా సచివాలయం హనుమంతునాయుడుపేట పరిధిలో వైసీపీ అభ్యర్థికి బూత్ రిగ్గింగ్ చేస్తాను. అలాగే మండలంలోని మిగతా 19 సచివాలయాల్లో వైసీపీకి అనుకూలంగా రిగ్గింగ్ చేయాలి' అని కార్యకర్తలకు సూచించారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు స్వగ్రామం నిమ్మాడలో.. సర్పంచ్ ఎన్నికల్లో ఆయనకు వ్యతిరేకంగా కింజరాపు అప్పన్నచే నామి నేషన్ వేయించింది తానేనని ప్రకటించారు.

జూట్ యాజమాన్యంపై చర్యలు తీసుకోండి

కలెక్టరేట్: నీలం జూట్ మిల్లు యాజమాన్యంపై తక్షణమే చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, పట్టణ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మికులకు ఎటువంటి సమాచారం లేకుండా వారి హక్కులను కాలరాసి, ఆకస్మాత్తుగా లాకౌట్ ప్రకటించడం అన్యాయమని, వెంటనే లాకౌట్‌ను ఎత్తివేయాలన్నారు. పరిశ్రమను మూసివేస్తే గత 38 ఏళ్లుగా పని చేస్తున్న కార్మికులు ఏమైపో వాలని ప్రశ్నించారు. కార్మికుల శ్రమతో లాభాలు ఆర్జించిన యాజమాన్యం నేడు ఇలా ప్రవర్తించడం అమానుషమన్నారు. కలెక్టర్ జోక్యం చేసుకుని పరిశ్రమను తెరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నీలం జూట్‌మిల్ కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎం.నాగే శ్వరరావు, నక్క సూరిబాబు, కోశాధికారి ఆర్.అప్పన్న, నాయకులు ఎస్.శిమ్మయ్య, కె.ముఖ లింగం, పి.వాసు, ఆర్.అప్పన్న, కె.నగేష్, ఎస్.ముత్యాలమ్మ, ఎంరాజేశ్వరి, బి.ఈశ్వరమ్మ, కె.లలిత కుమారి, పి.లక్ష్మి, ఎం.ధనలక్ష్మి, ఎస్.యశోదమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న జూట్ మిల్ కార్మికులు

శివపార్వతుల విగ్రహ ప్రతిష్ఠ

ఇచ్ఛాపురం: మండపల్లి పంచాయతీ పరిధి బుడ్డపు పేటలో చంద్రశేఖర స్వామి ఆలయం ప్రాంగణంలో శివపార్వతుల విగ్రహ ప్రతిష్ఠ, తులసి బృందావతి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ సోమ వారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే బెందాళం అశోక్ పూజల్లో పాల్గొనగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దక్కత ఢిల్లీరావు, సహదేవ్‌రెడ్డి, డి.కామేష్, బి.అప్పన్న, వెంకటరావు, చంద్రశేఖర్, పాతిర్ల ప్రతాప్‌రెడ్డి, కాళ్ల గోపి, గణపతి, నరేంద్రరెడ్డి, నూకరాజు పాల్గొన్నారు.

అధికారులు లేని సమావేశాలెందుకు?

● సమస్యలను ఎవరి దృష్టికి తీసుకువెళ్లాలి

● సంతబొమ్మాళి మండల సమావేశంలో సభ్యుల ఆగ్రహం

సంతబొమ్మాళి, మార్చి 11: అధికారులు లేని సమావేశాలు నిర్వహించడం ఎందుకు, సమస్యలను ఎవరి దృష్టికి తీసుకువెళ్లాలంటూ పలువురు సభ్యులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఎంపీపీ మేరుగు రాజేశ్వరి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోటపాడు, దండు గోపాలపురం సర్పంచ్‌లు కోత ఇందిర, మార్పు అశోక్ కుమార్ తదితరులు మాట్లాడుతూ.. సమావేశాలకు అధికారులు రారు, సమస్యలు పరిష్కారం కానప్పుడు సమావేశాలు దండగ అని అన్నారు. ఈ నేపథ్యంలో సమావేశానికి హాజరుకాని అధికారు లపై చర్యలు తీసుకునేలా తీర్మానం చేసి ఉన్నతాధికారులకు పంపాలని ఎంపీపీ రాజేశ్వరి ఎంపీడీవో ఉమా సుందరికి సూచించారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి ఎద్దడి నివారణకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారని మేఘవరం ఎంపీటీసీ, సర్పంచ్‌లు సూరాడ రాజారావు, పరపటి సునీత శ్రీనివాస్ ప్రశ్నించారు. ఇంటింటి కొళాయిలతో గ్రామాల్లో రోడ్లు తవ్వేశారని, వీటిలో పిల్లలు పడి గాయాలబారిన పడుతున్నారని, పనులు ఎప్పుడు పూర్తి చేస్తారని కో-ఆప్షన్ సభ్యుడు హనూరావు ప్రశ్నించారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మాట్లాడుతూ.. వేసవిలో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తామని పేర్కొన్నారు. ఇంటింటి కొళాయిలకు సంబంధించి జిల్లాలో 16 మండలాల్లో పనులు నిలిచి పోయాయని, నోటీసులిచ్చామన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పాల వసంతరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కెల్లి జగన్నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల బాండ్లు వివరాలు విడుదల చేయాలి

టెక్కలి: ఎన్నికల బాండ్ల వివరాలు విడుదల చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎదుట సోమవారం నిరసన తెలిపారు. ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధమని, మార్చి 6 నాటికే వివరాలు ఎన్నికల సంఘానికి అందజేయాలని సుప్రీంకోర్టు ఆదేశించినా ఇప్పటికీ బ్యాంకు అధికారులు వివరాలు వెల్లడించకపోవడం దారుణమని ఆ పార్టీ నాయకుడు నంబూరు షణ్ముఖరావు అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వరంగ బ్యాంక్ అయిన ఎస్‌బీఐ బాండ్ల వివరాలు విడుదల చేయక పోవడం కేంద్ర బీజేపీ కుట్రలో భాగమేనన్నారు. కార్యక్రమంలో నాయకులు కొల్లి ఎల్లయ్య, ఈశ్వరరావు, ధనుంజయ, ఉదయ్, సాంబమూర్తి, పోలయ్య, గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.

కడప జిల్లాలో జిల్లా కళాకారుల తప్పెటగుళ్ల ప్రదర్శన

పలాసరూరల్: కడప జిల్లా గొల్లపల్లి గ్రామంలో ఈనెల 9 నుంచి మంగళవారం వరకు నిర్వహిం చిన గంగమ్మ జాతరలో రేగులపాడుకు చెందిన తప్పెటగుళ్ల ప్రదర్శన చేశారు. పీత గంగయ్య ఆధ్వ ర్యంలో కళాకారులు తప్పెట గుళ్లతో తమ ప్రతిభను ప్రదర్శించారు. వీరిని గిడుగు రామమూర్తి కళాపీఠం అధ్యక్షుడు బద్రి కూర్మారావు తదితరులు అభినందించారు.


గంగమ్మ జాతరలో తప్పెటగుళ్లు ప్రదర్శిస్తున్న కళాకారులు

టీడీపీ విజయానికి కృషి చేయండి

● పార్టీ జిల్లా అధ్యక్షుడు రవికుమార్


ఆమదాలవలస: రవికుమార్ సమక్షంలో టీడీపీలో చేరిన వంజంగి వైసీపీ నాయకులు

ఆమదాలవలస: రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం ప్రతి ఒక్క రూ కృషిచేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు రవికుమార్ కోరారు. సోమవారం వంజంగి మాజీ సర్పంచ్ ఎండ అప్పల నాయుడు ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన 40 దళిత కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరాయి. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో విధ్వంసకర పాలనతో దళిత వర్గాలను అన్ని విధాలుగా అణగదొక్కిన జగన్ దళిత ద్రోహి అన్నారు. వైసీపీ నాయకులు కళ్యాణ్ రాము, చింతాడ గణేష్, అలమండ తాతా రావు, దవళ గణపతిరావు, కొన్ని సోములు, ముక్క నారాయణ తదితరులు టీడీపీలో చేరారు.

సమష్టిగా కృషి చేయాలి: ఎమ్మెల్యే అశోక్

కవిటి: ఇచ్ఛాపురం నియోజకవర్గంలో కార్యకర్తలు, నాయకులు సమష్టిగా కృషిచేసి టీడీపీ విజయానికి కృషి చేయాలని ఎమ్మెల్యే బి.అశోక్ పిలుపునిచ్చారు. సోమవారం కవిటిలో నియోజకవర్గ నేతలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలను ప్రతి ఇంటికీ తెలియజేయాలన్నారు. జగన్‌రెడ్డి అరాచకాలు సృష్టించి ఎన్నికలు నిర్వహణకు సిద్ధమవుతున్నారని, వాటిని అధిగమించి పార్టీని గెలిపించాలన్నారు. సమావేశంలో కవిటి, కంచిలి, ఇచ్ఛాపురం, సోంపేట మండలాల నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. ● చంద్రబాబుతోనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని ఇచ్ఛా పురం ఎమ్మెల్యే సతీమణి బి.నీలోత్పల అన్నారు. సోమవారం బిగొన పపుట్టుగ పంచాయతీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపిస్తే అమలు చేయబోయే సూపర్ సిక్స్ పథకాలను వివరించారు.


కవిటి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

టీడీపీ నాయకుల ఆత్మీయ కలయిక

సరుబుజ్జిలి: మండలంలోని 21 పంచాయతీల్లో పార్టీ నాయకులతో ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తు న్నట్టు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శివ్వాల సూర్యనారాయణ తెలిపారు. సోమవారం షలంత్రి, సింధువాడ పంచాయతీల్లో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలో నెలకొన్న సమస్యలు పరిష్కరిస్తూ ఎన్నికల్లో వ్యవహరిం చాల్సిన విధి విధానాలపై పార్టీ శ్రేణులను అప్రమత్తం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు అంబళ్ల రాంబాబు, కిల్లి సిద్దార్థ, లావేటి పూర్ణారావు, తాడేల వెంకటరమణ, అత్తులూరి హరిబాబు, కందుల వెంకటరావు పాల్గొన్నారు.


షలంత్రిలో పర్యటిస్తున్న టీడీపీ నాయకులు

అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో హామీల అమలు

● టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష

పలాస, మార్చి 11: రానున్నది టీడీపీ ప్రభుత్వమేనని, తాము అధికారంలోకి వచ్చిన మూడు నెల ల్లోనే నియోజకవర్గంలో సమస్యలపై ఇచ్చిన హామీలను అమలు చేస్తామని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్య దర్శి గౌతు శిరీష అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో పలాస నియోజకవర్గ కార్యకర్తలు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఐకమత్యమే బలమని నిరూపిద్దామని, రాష్ట్రంలో ఎవరూ ఇవ్వలేనంతగా అధిక మెజార్టీ సాధించి చంద్రబాబునాయుడుకు కానుకగా ఇద్దామన్నారు. దీనికోసం ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుదామన్నారు. మునిసిపాలిటీలో ప్రతి వార్డుకు తాగునీరు, రహదారుల నిర్మాణంతో పాటు పారిశుధ్య నిర్వహణ సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. మూడేళ్లలో ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పూర్తి చేసి సాగు, తాగునీరు అందిస్తామన్నారు. ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం మన హయాంలోనే పూర్తవుతుందన్నారు. ఇటీవల సీఎం జగన్మోహనరెడ్డి ప్రారంభించిన కిడ్నీ పరిశోధన కేంద్రం రూపాన్ని మార్చారని, ఆసుపత్రి కన్నా అధ్వానంగా అక్కడ సేవలు ఉన్నాయని, దీనిని పూర్తి పరిశోధన కేంద్రంగా, 200 పడకల ఆసుపత్రిగా మారుస్తామని ప్రకటించారు. అలాగే మందస, వజ్రపుకొత్తూరు మండలాల్లోని సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆస్ట్రేలియాలోని ఎన్ఆర్ఐలు పలాస నియోజకవర్గంలో ఉచితంగా స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించేందుకు సుముఖత చూపించారని, నాలుగు నెలల్లో దీనికి కార్యరూపం జరుగుతుందన్నారు. సమావేశంలో నాయకులు వజ్జ బాబూరావు, సమన్వయకర్త యార్లగెడ్డ వెంకన్నచౌదరి, పీరికట్ల విఠల్, లొడగల కామేశ్వరరావు యాదవ్, వసంత స్వామి, సప్ప నవీన్, బడ్డ నాగ రాజు, గాలి కృష్ణారావు, శాసనపురి మురళీకృష్ణ, మల్లా శ్రీను, గురిటి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గౌతు శిరీష

పౌష్టికాహారంతో ఆరోగ్యం

వజ్రపుకొత్తూరు: పౌష్టికాహారంతో చిన్నారులకు ఆరోగ్యం సిద్ధిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.గంగమ్మ అన్నారు. సోమవారం కొండపూరు అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం పక్షోత్సవం నిర్వహించారు. బాలింతలు, గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.భాస్కరరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

నందిగాం: నందిగాం మెయిన్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎన్ఐడీడీసీపీ కార్యక్రమానికి సంబంధించి జిల్లాస్థాయి సర్వేలో భాగంగా పీహెచ్‌సీ వైద్యాధికారి కె.అనితకుమారి విద్యార్థులకు వివిధ పరీక్షల చేసి నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తెలిపారు. సీహెచ్‌వో దాతారాం, హెల్త్ అసిస్టెంట్ ఫల్గుణ రావు, హెచ్ఎం జె.చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

జీడికి మద్దతు ధర ప్రకటించే వరకూ పోరాటం

కాశీబుగ్గ: జీడి పిక్కలు 80 కేజీల బస్తాకు రూ.16 వేలు మద్దతు ధర ప్రకటించి ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేయాలని, అంతవరకు పోరాటం చేస్తామని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. జీడి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ సోమవారం స్థానిక గాంధీ విగ్రహం ఎదుట మహా ధర్నా నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.మోహన రావు, జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్‌కుమార్, సీపీఐ రాష్ట్ర నాయకుడు చాపర సుందర్‌లాల్, లిబరేషన్ నాయకులు సన్యాసి రావు, కుసుమ మాట్లాడారు. జీడి రైతులు మరోసారి మోసపోకుండా వారికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అధికార పార్టీ తో పాటు ప్రతిపక్షాలు కూడా జీడి రైతులపై సకాలంలో స్పందించకుంటే రానున్న ఎన్నికల్లో బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో వామపక్ష నాయకులు చాపర వేణుగోపాల్, గణపతి, రామారావు, వినోద్, బాలాజీ, హేమారావు చౌదరి, వాసు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మోహనరావు

నాణ్యమైన వైద్యసేవలతో మన్ననలు పొందండి

● సుశృత నర్సింగ్ హోమ్ వైద్యుడు దంతం భీమారావు

కాశీబుగ్గ: అన్ని వర్గాల ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించి మన్ననలు పొందాలని సుశృత నర్సింగ్ హోమ్ వైద్యుడు దంతం భీమారావు అన్నారు. సోమవారం కాశీబుగ్గలో సావిత్రి కిడ్నీ సెంటర్, డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రముఖ వైద్యులు యర్ర రాకేష్, నల్లా అనూషలు కిడ్నీ సెంటర్, డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయడం ఆనందదాయకమన్నారు. ఈ ప్రాంత ప్రజలను పట్టి పీడిస్తున్న కిడ్నీ మహమ్మారిని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు, మాజీ మంత్రి గౌతు శ్యామ్ సుందర్ శివాజీ, వివిధ కార్మిక వర్తక సంఘాల గౌరవాధ్యక్షుడు దువ్వాడ శ్రీకాంత్, ప్రముఖ వైద్యులు దువ్వాడ జీవితేశ్వరరావు, అల్లు పద్మజ, ఎం.మల్లేశ్వరరావు, కూన మోహన్‌బాబు, తెప్పల ఆనంద్, ప్రకాష్ వర్మ తదితరులు పాల్గొన్నారు.


డయాలిసిస్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న డా.భీమారావు

మలియాలింగుపురంలో బోరు ఏర్పాటు

నందిగాం: హర్షబాడ పంచాయతీ మలియాలింగుపురంలో కొత్తగా బోరు ఏర్పాటు చేశారు. ఆదివారం గ్రామంలో గిరిజన దండోరా సభలో తాగునీటి సమస్యను ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి నడి మింటి నాగరాజు, గిరిజన నాయకుడు మొగిలిపాటి జగ్గారావు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆయన స్పందించి ప్రత్యేక గ్రాంట్‌తో బోరు తవ్వకం చేపట్టాలని సూచించడంతో అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకున్నారు. టీడీపీ నాయకులు పి.అజయ్ కుమార్, ఎం.బాలకృష్ణ తదితరులు బోరు తవ్వకాన్ని పరిశీలించారు. దీంతో గ్రామస్థులు హర్షం వ్యక్తంచేశారు.


బోరు ఏర్పాటుకు పూజలు చేస్తున్న దృశ్యం

ఆదివాసీల దీక్ష భగ్నం

పాతపట్నం: ఇతర కులస్థులను ఎస్టీల్లో చేర్చకూడదంటూ పాతపట్నంలో ఆదివాసీ సంక్షేమ సంఘం నేతలు చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షను పోలీసులు సోమవారం తెల్లవారుజామున భగ్నం చేశారు. ఆమరణ దీక్ష చేపట్టిన రాష్ట్ర నాయకులు వాబ యోగి, బైదలాపురం సింహాచలం ఆరోగ్యం క్షీణి స్తోందన్న సాకుతో పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేసి అక్కడి నుంచి తరలించినట్లు ఆ సంఘ నాయ కులు పేర్కొన్నారు. వారికి మద్దతుగా కూర్చున్న గురాడి అప్పన్న, బైరిసింగి సింహాచలం, తడకల వెంక టి, ఒబ్బంగి రామయ్య తదితరులను అరెస్ట్ చేసి సంతబొమ్మాళి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. శాంతి యుతంగా నిర్వహిస్తున్న దీక్ష శిబిరాన్ని ఎత్తివేయడం ఆదివాసీల హక్కులను కాలరాయడమేనని ఆ సంఘం నాయకుడు మల్లిపురం శ్రీనివాసరావు అన్నారు. అరెస్ట్ చేసిన వారిని తక్షణం విడుదల చేయాలని కోరారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

టెక్కలి: మత్తు పదార్థాలకు యువత దూరం గా ఉండాలని ఎస్ఐ కె.లక్ష్మి అన్నారు. సోమవారం రావివలసలో ప్రత్యేక ఎన్ఎస్ఎస్ సేవా శిబిరంలో ఆమె పాల్గొన్నారు. విలువైన భవిష్యత్ కోసం సక్రమ మార్గంలో పయనించి ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ గోవిం దమ్మ, ఎన్ఎస్ఎస్ పీవో లూకపాల్ పాల్గొన్నారు.


సంతబొమ్మాళి: ఇజ్జువరంలో పథకాలపై అవగాహన కల్పిస్తున్న నాయకులు


కొత్తూరు: మాట్లాడుతున్న కలమట వెంకటరమణ


సారవకోట మండలం బుడితిలో..

టీడీపీ-జనసేనతో రాష్ట్రాభివృద్ధి


లావేరు: నాగంపాలెంలో పర్యటిస్తున్న రామ్మల్లిక్ నాయుడు

లావేరు: టీడీపీ, జనసేనతో రాష్ట్రాభివృద్ధి సాధ్యపడుతుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్మల్లిక్‌నాయుడు అన్నారు. సోమవారం వేణుగోపాలపురం, నాగంపాలెం గ్రామాల్లో బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో బాబు సూపర్ సిక్స్ పథకాలకు సంబంధించి ఇంటింటా ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్, విజయనగరం పార్లమెంటరీ పార్టీ కార్యదర్శి లంక నారాయణ రావు, మాజీ జడ్పీటీసీ పిన్నింటి మధుబాబు, పార్టీ నాయకులు మజ్జి రామ్మూర్తి నాయుడు, దుర్గాశి రాంబాబు, సుత్తి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో టీడీపీదే విజయం

సంతబొమ్మాళి: రానున్న ఎన్నికల్లో టీడీపీదే విజయమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు జీరు భీమారావు అన్నారు. సోమవారం ఇజ్జువరంలో ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కలిగించారు. మాజీ సర్పంచ్ బొడ్డేపల్లి సత్యనారాయణ, మండల తెలుగు యువత అధ్యక్షుడు కూశెట్టి భానుప్రకాష్, ఐటీడీపీ అధ్యక్షుడు బెండి అరుణ్‌కుమార్, మెండ రామినాయుడు, సువ్వారి ప్రసాద్ పాల్గొన్నారు.

టీడీపీ విజయానికి కృషి చేయాలి

కొత్తూరు: రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయానికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకట రమణ అన్నారు. మెట్టూరు సెంటర్‌లోని పార్టీ కార్యాలయంలో సోమవారం పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. విజయమే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీకి పట్టం కట్టండి

టెక్కలి: రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బగాది శేషగిరిరావు అన్నారు. సోమవారం మేఘవరం పంచాయతీ సరియాపల్లి, డెప్పూరు, పెద్ద భీంపురం, కోదండపురం గ్రామాల్లో సూపర్‌సిక్స్, భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

బుడితిలో..

జలుమూరు (సారవకోట): టీడీపీ-జనసేన ఉమ్మడి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ మండల అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ అన్నారు. బుడితి జనా వీధిలో సోమవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎర్ర రమణమ్మ, నాయకులు ముద్ద భీమారావు, పిచ్చిక సూరి, చల్ల ఆనందరావు, జయరాం పాల్గొన్నారు.

వైసీపీ అరాచకాలకు అడ్డుకట్టు వేయాలి

నరసన్నపేట: వైసీపీ ప్రభుత్వ అరాచకాలకు అడ్డుకట్టు వేసేందుకు ప్రతీ ఒక్కరు నడుంబిగించాలని తెలుగు యువత నాయకుడు సీతా రాం, మాజీ ఎంపీటీసీ పీస కృష్ణ అన్నారు. సోమవారం జగన్నాథపురం, బండి వీధుల్లో సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కలిగించారు. అలాగే దుద్దిపేట, జగన్నాథపురం గ్రామాల్లో శంఖారావం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు అడపా చంద్రశేఖర్, రామరాజు, రాజు, సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

పొందూరులో బాబు ష్యూరిటీ..

పొందూరు: మేజరు పంచాయతీ పొందూరు పట్టణంలో సోమవారం బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి టీడీపీ మినీ మేనిఫెస్టోపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యర్తలు పాల్గొన్నారు.


నరసన్నపేట: అవగాహన కలిగిస్తున్న తెలుగుయువత ప్రతినిధులు


టెక్కలి: సరియాపల్లిలో అవగాహన కల్పిస్తున్న శేషగిరి


పొందూరు: ఇంటింటికి వెళ్లి ప్రచారం చేస్తున్న టీడీపీ శ్రేణులు

రుణాలు ఎందుకు ఇవ్వడం లేదు

- యూనియన్ బ్యాంక్ అధికారుల బృందం ఆరా
- రణస్థలంలో విచారణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



వెలుగు సిబ్బందిని విచారిస్తున్న బ్యాంకు బృందం

రణస్థలం: స్వయం సహాయక సభ్యులకు రుణాలు ఇవ్వకపోవడంపై బ్యాంకు ఉన్నతాధికారులు దృష్టి సారించారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో 'రుణాలు ఇవ్వట్లే' శీర్షికతో ప్రచురితమైన కథనానికి స్పందించారు. యూనియన్ బ్యాంకు విశాఖ జనరల్ మేనేజర్ ఆదేశాల మేరకు ఎస్ఎం డి.జ యరామ్ ఆధ్వర్యంలో అధికారుల బృందం ప్రత్యేకంగా దర్యాప్తు నిర్వహించింది. రణ స్థలం యూనియన్ బ్యాంకును ఆకస్మికంగా సందర్శించి సిబ్బంది పనితీరు పరిశీలిం చింది. స్వయం సహాయక సభ్యులకు రుణాలు రెన్యూవల్, చెల్లింపులు ఎందుకు చేయడం లేదని, జగనన్న తోడుకు బ్యాంకు నంబర్లు ఇచ్చినప్పటికీ వారి ఖాతాల్లో నగదు ఎందుక జమ చేయడం లేదని ప్రశ్నించారు. 'ఆంధ్రజ్యోతి' కథనంలో వచ్చిన ప్రతి అంశంపై ఆరాతీశారు. అనంతరం వెలుగు సిబ్బందిని విచారించారు. సీసీ, సీఎఫ్‌ల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. జగనన్న తోడు పథకానికి సంబంధించిన అంశాలను సైతం ప్రస్తావించారు. జేఆర్ పురం భవానీ స్వయం సహాయక సంఘం సభ్యులను విచారించారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఓ సభ్యురాలి ఇంటికి వెళ్లి ప్రశ్నించారు. ఈ సందర్భంగా విచారణ అధికారి, సీనియర్ మేనేజర్ జయరాం మాట్లాడుతూ.. విచారణ చేపట్టామని, సమగ్ర నివేదికలు ఉన్నతాధికారులకు అందిస్తామని చెప్పారు. కాగా ఆంధ్రజ్యోతి కథనం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. బ్యాంకుల్లో సేవలు జాప్యం నిజమేనని ఎక్కువ మంది అభిప్రాయపడుతున్నారు.

చేయూత సదస్సులో ఆకలి కేకలు

లావేరు: మండల సమాఖ్య ఆధ్వర్యంలో సుభద్రాపురం జంక్షన్ వద్ద సోమవారం నిర్వహించిన వైఎస్ఆర్ చేయూత చెక్కుల పంపిణీ సదస్సుకు వచ్చిన చాలా మంది మహిళలకు సరిపడ భోజనాలు లేక ఆకలి కేకలు వేశారు. ఈ పథకం కింద మండలంలో 4,994 మంది అర్హత గల మహిళలకు రూ.9.36 కోట్లు మేరకు లబ్ధి చేకూరింది. అయితే వీరికి స్థానిక ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ చేతులు మీదుగా చెక్కులను పంపిణీ చేస్తారని చెప్పి మండల ఐకేపీ సిబ్బంది అధిక సంఖ్యలో లబ్ధిదారులను మండల కేంద్రానికి తరలించారు. అందుకు తగిన ఏర్పాట్లు చేయకపోవడంతో వారంతా అవస్థలుపడ్డారు. ముఖ్యంగా సరిపడ భోజనాలు లేకపోవడంతో వారంతా ఇబ్బందిపడ్డారు. భోజనాలకు తోపులాడుకోవడంతో పోలీసులు వారికి సర్ది చెప్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. చివరికి భోజనం దరొకినోలు తిన్నారు.. లేనివారు ఈసురోమంటూ ఆకలితో తిరిగి పయనమయ్యారు. ఈ సదస్సులో ఎంపీపీ లుట్ల అమ్మాజమ్మ, జడ్పీటీసీ మీసాల సీతంన్నాయుడు, ఎంపీడీవో కొండలరావు, ప్రత్యేకాహ్వానితులు రొక్కం బాలకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు బూరాడ చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఏయూ రిజిస్ట్రార్‌గా సుజాత


వీసీ రజని నుంచి నియామక పత్రాలు అందుకుంటున్న సుజాత, అడ్డయ్య

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా పీలా సుజాత, రెక్టార్‌గా బిడ్డిక అడ్డయ్య నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం వీరికి వీసీ కేఆర్ రజని తన చాంబర్‌లో నియామక పత్రాలు అందజేశారు. ఇప్పటి వరకు రిజిస్ట్రార్‌గా పనిచేసి.. ప్రస్తుతం రెక్టార్‌గా నియమితులైన అడ్డయ్య 1994లో అర్థశాస్త్రం విభాగంలో రీసెర్చ్ అసిస్టెంట్‌గా కెరీర్ ప్రారంభించారు. 2012లో ప్రొఫెసర్‌గా పదోన్నతి పొంది, అనంతరం వర్సిటీ పాలకమండలి సభ్యునిగా, పలు కమిటీల్లో సభ్యునిగా, చీఫ్ ఎగ్జామినర్‌గా, అడకమిక్ ఎఫైర్స్ డీన్‌గా, ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. రిజిస్ట్రార్‌గా నియమితులైన పీలా సుజాత 2010లో బీఆర్ఏయూలో బయోటెక్నాలజీ విభాగంలో అధ్యాపకురాలిగా కెరీర్‌ను ప్రారంభించారు. 2022లో ఉత్తమ పరిశోధకురాలి అవార్డు (స్నాతకోత్సవం)ను బీఆర్ఏయూ నుంచి అందుకున్నారు. వర్సిటీ పాలకమండలి సభ్యురాలిగా, ఐక్యూఏసీ, నాక్ సమన్వయకర్తగా, సీడీసీ డీన్‌గా, స్పోర్ట్స్ విభాగం డీన్‌గా, ఇంజనీరింగ్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. కాగా, రెక్టార్‌గా అడ్డయ్య, రిజిస్ట్రార్‌గా సుజాత నియామకంపై వర్సిటీ అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

ఓట్లు అడిగే నైతిక హక్కు జగన్‌రెడ్డికి లేదు

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్

అరసవల్లి: దళిత, బడుగు, బలహీన వర్గాల ప్రజలను మోసం చేసి, మాట తప్పి మడమ తిప్పిన జగన్‌రెడ్డికి ప్రజలను ఓట్లు అడిగే హక్కులేదని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ అన్నారు. సోమవారం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మద్య నిషేధం చేశాకే ఓటు అడుగుతానన్న జగన్, నాసిరకం మద్యంతో 30వేల మంది మరణానికి కారకుడై, 35లక్షల మందిని అనారోగ్యం పాలు చేశాడన్నారు. ఏ ముఖం పెట్టుకుని ప్రజల వద్దకు వచ్చి ఓటు అడుగుతావు జగన్‌రెడ్డీ అని నిలదీశారు. 14 లక్షల ఎకరాల అసైన్‌మెంట్ భూమిని కబ్జా చేసి దేశంలోనే గొప్ప రికార్డు నెలకొల్పిన ఘనత సాధించావు. నీవు ఇస్తానన్న మూడు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఏమయ్యాయి? జాబ్ క్యాలెండర్ ఏదీ? మెగా డీఎస్సీని ఏం చేశావు?.. ఇంకెన్నాళ్లు ప్రజలను మోసం చేయగలవు. ఐదేళ్ల పాలనలో ఇచ్చిన హామీకి విరుద్ధంగా తొమ్మిదిసార్లు విద్యుత్ చార్జీలు పెంచావు, యువతను మత్తులో ముంచి, గంజాయి ఆంధ్రప్రదేశ్‌గా మార్చావు, ఇదేనా సంక్షేమం, ఇదేనా అభివృద్ధి? అంటూ రవికుమార్ నిలదీశారు. ప్రజల ఆకాంక్ష మేరకు టీడీపీ, జనసేన, బీజేపీ ఒక్కటై నియంత దోపిడీని అంతం చేయడం ఖాయమన్నారు. అరాచకత్వానికి రోజులు దగ్గర పడ్డాయని, ప్రజలు స్పష్టమైన తీర్పునిచ్చి నీకు గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు.

రక్తదానానికి యువత ముందుకు రావాలి

జి.సిగడాం: రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర వైస్ ఛైర్మన్ పి.జగన్మోహన్‌రావు అన్నారు. సోమవారం పెంట గ్రామంలో ఆయన గ్రామీణ యువకులకు రక్తదానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణ ప్రాంతాల్లో, కళాశాలల్లో యువకుల ద్వారా రక్తదాన శిబిరాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. రక్తదానం మరొకరికి ప్రాణదానమని, నేత్రదానం మరో ఇద్దరికి చూపునిస్తుందన్నారు. సంస్థ ద్వారా 24 రాకాల సేవా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈయన వెంట కార్యదర్శి బలివాడ మల్లేశ్వరరావు, జాతీయ యువజన అవార్డు గ్రహీత పెంకి చైతన్యకుమార్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలి

జి.సిగడాం: కౌలు, చిన్న, సన్నకారు రైతుల సమస్యలను పరిష్కరించాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు డిమాండ్ చేశారు. సోమవారం శేతుభీమవరంలో నిర్వహించిన కౌలు రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కౌలురైతు పండించిన పంటకు కనీస మద్దతు ధర కల్పించాలన్నారు. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మొక్కజొన్న, తదితర పంటలను ఆర్బీకేల ద్వారా కొనుగోలు జరిగేటట్టు చర్యలు తీసుకోవాలన్నారు. కౌలురైతు సంఘ నాయకులు రమణ, ఎస్.జగదీష్, శివుడు, టి.అప్పలనాయుడు, ఆదినారాయణ పాల్గొన్నారు.

క్యాంపస్ సెలక్షన్స్‌లో విద్యార్థుల ప్రతిభ


ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: క్యాంపస్ సెలక్షన్స్‌లో కాకినాడ ఆదిత్య మహిళా కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటినట్టు కళాశాల డైరెక్టర్ చక్రవర్తి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 9వ తేదీన విజయనగరం క్యాంపస్‌లో నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 158 మంది కాకినాడ ఆదిత్య మహిళా కళాశాల విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని కళాశాల డైరెక్టర్ బీఎస్ చక్రవర్తి చెప్పారు. విద్యార్థి దశలోనే ఉద్యోగాలు సాధించడం హర్షనీయమని వారందరికి డైరెక్టర్‌తో పాటు ప్రిన్సిపాల్ శివశంకర్, చైర్మన్ ఎన్.శేషారెడ్డి అభినందనలు తెలిపారు.

డీఆర్డీఏ పీడీగా కిరణ్‌కుమార్

కలెక్టరేట్: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారిగా పి.కిరణ్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో పార్వతీపురం జిల్లాలో పీడీగా విధులు నిర్వహించి బదిలీపై ఇక్కడికి వచ్చారు. తొలుత కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

సైన్స్‌పై ఆసక్తి పెంపొందించాలి

రణస్థలం: చిన్నప్పటి నుంచే సైన్స్‌పై ఆసక్తి పెంపొందించాలి డీఈవో కె.వెంకటరావు అన్నారు. సోమవారం కోష్టలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఆయన పరిశీలించి మాట్లాడారు. చిన్నారులు ప్రదర్శించిన 464 ప్రాజెక్టులను ప్రదర్శించగా, వాటిని పరిశీలించిన డీఈవో వారిని అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవో త్రినాథరావు, పాఠశాల డైరెక్టర్ కెల్ల మంజుభార్గవి, కెల్ల గోవింద, గౌరునాయుడు పాల్గొన్నారు.

శ్రీమద్రామాయణ పారాయణం



శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాలకొండ రోడ్డులో ఉన్న కో దండరామ స్వామి ఆలయంలో శ్రీమద్రామాయణ పారా యణ అర్చకులు చామర్తి శ్రీనివాసాచార్యులు, బంకుపల్లి శేషాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వక్షేణ పూజలు చేశారు.

రాష్ట్ర భవిష్యత్ కోసమే కూటమి ఏర్పాటు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

ఇచ్ఛాపురం: రాష్ట్ర ప్రజల భవిష్యత్ కోసమే టీడీపీ-జనసేన- బీజేపీ కూటమిగా ఏర్పడ్డాయని ఎమ్మెల్యే బెందాళం అశోక్ తెలిపారు. సోమవారం ఇచ్ఛాపురంలోని స్వేచ్ఛావతి అమ్మవారి గుడి వీధిలో గల అయ్యప్ప గుడి పక్కన ఎంపీ నిధులు రూ.5 లక్షలతో కళింగ వైశ్యుల సంఘం కోసం నిర్మించనున్న సామాజిక భవనానికి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ కళింగ వైశ్యులను ఓబీసీలో కూడా చేర్పించాలని పార్లమెంట్‌లో ఎంపీ రామ్మోహన్‌నాయుడు కృషి చేస్తున్నారని తెలిపారు. అధికారులకు సమాచారం లేకుండా టెండర్ ప్రక్రియలు పూర్తి కాకుండానే బాహుదా వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్నారంటే ఏవిధంగా ప్రజలకు మభ్యపెడుతున్నారో అర్థమవుతుందని తెలిపారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి రాజు, టీడీపీ పట్టణాధ్యక్ష కార్యదర్శులు కాళ్ల ధర్మారావు, నందికి జాని, రాష్ట్ర కార్యదర్శి సాలిన డిల్లీయాదవ్, కౌన్సిలర్లు కాళ్ల దిలీప్, పత్రి తవిటయ్య, శేఖర్, జిల్లా కార్యదర్శి ఆశి లీలారాణి, జిలానా పాల్గొన్నారు. కాగా కళింగ వైశ్యుల సంఘ ప్రతినిధులు ఎమ్మెల్యే అశోక్, దాసరి రాజును సత్కరించారు.

బాల్య వివాహాలు చట్ట విరుద్ధం

కలెక్టరేట్: బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని, ఇటువంటి వివాహాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్యవివాహాల నిర్మూలనకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆడపిల్లలను బాగా చదివించాలని, మహిళా సాధికారత, సమానత్వం ద్వారానే సమాజం పురోభివృద్ధి చెందుతుందన్నారు. ఈ నెల 9వ తేదీ నుంచి 23వ తేదీ వరకు 'పోషన్ పక్వాడ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. దీనికి సంబంధించి కూడా వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ, జిల్లా బాలల రక్షణ అధికారి కేవీ రమణ పాల్గొన్నారు.

'ఎఫ్‌పీవోల్లో అభివృద్ధి కార్యక్రమాలు'

బూర్జ: రైతు ఉత్పాదక కంపెనీల్లో(ఎఫ్‌పీవో) పలు అభివృద్ధి కార్యక్రమాలు జరుగు తాయని నాబార్డు జిల్లా మేనేజర్ శ్రీకాకుళం వరప్రసాద్ కుప్పిలి తెలిపారు. సోమ వారం మండలంలోని గోపీదేవిపేటలోఆర్ప్ సంస్థ సహకారంతో ఏర్పాటు చేసిన మన్యం సహజ ఉత్పత్తిదారుల కంపెనీల కలెక్షన్స్ సెంటర్‌ను ప్రారంభించారు. జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్, ఆర్ప్ సంస్థ డైరెక్టర్ ఎన్.సన్యాసిరావు, కృషి విజ్ఞాన శాస్త్రవేత్తలు డాక్టర్ నీలవేణి, అనూష, వావిలపల్లి రాజేశ్వరరావు, ఏవో బి.శంకర రావు, సీఈవో మామిడి సూర్యనారాయణ పాల్గొన్నారు.

అనర్హులకు ఇళ్ల పట్టాలు

పొందూరు: జగనన్న కాలనీ పేరుతో అనర్హులకు ఇళ్ల పట్టాలు ఇచ్చారని, దీంతో ఇళ్ల పట్టాలు పొందిన లబ్ధిదారులు ఒకరైతే ఈ స్థలంలో నిర్మించినది మరొకరని, ఇటువంటి అక్రమాలపై అధికారులు దృష్టి సారించరా అని పిల్లలవలస సర్పంచ్, టీడీపీ నాయకుడు బుడుమూరు పోలినాయుడు అధికారులను ప్రశ్నించారు. సోమవారం ఎంపీడీవో సమావేశ మందిరంలో ఎంపీపీ కిల్లి ఉషారాణి అధ్యక్షతన మండల పరిషత్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలినాయుడు, కింతలి సర్పంచ్ రామప్రసాద్ మాట్లాడుతూ రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వల్ల మ్యుటేషన్లు జరగడంలేదని, పిల్లలవలస, ధర్మ పురం దళ్లవలసలో భూసర్వే నిలిచిపోయిందని తహసీల్దార్‌ను అడిగితే ఎన్నికల విధుల్లో ఉన్నామని సమాధానం వస్తోందని ఆరోపించారు. అనంతరం వివిధ శాఖలపై సమీక్షించారు. సమావేశంలో ఎంపీడీవో సూర్యనారాయణ, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

బాహుదా వంతెనకు శంకుస్థాపన

ఇచ్ఛాపురం: మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్స్ నిధులు రూ.20 కోట్ల అంచనాతో నిర్మించనున్న బాహుదా బ్రిడ్జికి మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సోమవారం రాత్రి శంకుస్థాపనచేశారు. ఎన్నికల కోడ్ వస్తుందన్న ఊహాగానాల నేపథ్యంలో టెండర్ ప్రక్రియ పూర్తి కాకుండానే ఆదరాబాదరగా పనులు ప్రారంభించడంపై ప్రతిపక్ష నాయకులు తప్పుపడుతున్నారు. జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, సాయిరాజ్, మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి పాల్గొన్నారు. అలాగే మున్సిపాల్టీ పరిధిలోని బెల్లుపడ, పురుషోత్తపురం వార్డులో నిర్మించిన అర్బన్‌హెల్త్ సెంటర్లను మంత్రి అప్పలరాజు సోమవారం ప్రారంభించారు. ● **సోంపేట:** బారువ వద్ద మహేంద్రతనయ నదిపై నిర్మించతలపెట్టిన కొండిరేవు వంతెన పనులకు మంత్రి అప్పలరాజుసోమవారం శంకుస్థాపన చేశారు. బారువ డిగ్రీ కళాశాలలో నిర్మించిన అదనపు గదులను, ఆర్బీకే, వెల్‌నెస్ సెంటర్‌ను ప్రారంభించారు.

ప్రమాదమని తెలిసి కూడా..



కంచిలి: గొల్లకంచిలి వద్ద రైల్వే ట్రాక్ వద్ద గేటు వేసి ఉన్నా ద్విచక్రవాహనదారులు గేటు కింద నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. అలా ప్రయాణించడం ప్రమాదమని తెలిసినా వాహనచోదకలు పట్టించుకోవడం లేదు. సోమవారం సాయంత్రం రైలు వస్తుందని గేట్ మెన్ గేటు వేశారు. రైలు వస్తుండగానే త్వరగా వెళ్లి పోవాలని యువకులు గేటు కింద నుంచి బైకును తీసుకుంటూ వెళ్లడం విశేషం.

వైసీపీ ఓటమి ఖాయం

అరసవల్లి: ఇటీవల జరిగిన ఓ సమావేశంలో మంత్రి ధర్మాన మాట్లాడుతూ.. మగవాళ్లకు మా ప్రభుత్వంపై కోపం ఉంటుందని అనడం చూస్తుంటే వైసీపీ మళ్లీ అధికారంలోకి వచ్చే అవకాశమే లేదన్న విషయం స్పష్టమవుతోందని మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నాయకుడు గుండ. అప్పలసూర్యనారాయణ అన్నారు. సోమవారం ఆయన తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి పనిచేయాలని నిర్ణయిండంతో వైసీపీ పరిస్థితి ఎలా ఉంటుందో తెలిసే మంత్రి ఇలా నిరాశలో మాట్లాడుతున్నారన్నారు. టీడీపీ తన మేనిఫెస్టోలో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల అమలు ద్వారా సంక్షేమం సాధ్యపడుతుందన్నారు. బీసీలకు పెద్దపీట వేసిన పార్టీ టీడీపీ అని, మహిళా సాధికారతకు గుర్తుగా మహిళలకు ఆస్తిలో సమాన హక్కును కల్పించింది ఎన్టీఆర్ అని అన్నారు. వాస్తవ పరిస్థితులకు విరుద్ధంగా మంత్రి ధర్మాన మాట్లాడి మహిళలను మాయ చేయడానికి ప్రయత్నిస్తే నమ్మే పరిస్థితి లేదన్నారు.

బావిలోని చెత్త తొలగింపు

ఇచ్ఛాపురం: మునిసిపాలిటీలోని 21,22 వార్డుల పరిధిలో గల వీకేపేట జంక్షన్ వద్ద గల మంచినీటి బావిలో పేరుకుపోయిన చెత్తను 22వ వార్డు టీడీపీ కౌన్సిలర్ కాళ్ల దిలీప్, తెలుగు యువత అధ్యక్షుడు కాళ్ల జయదేవ్ సోమవారం తొలగించారు. ఇక్కడి నుంచే వార్డు ప్రజలంతా నీటిని తీసుకువెళ్తుంటారు. అయితే చెత్త పేరు కుపోవడంతో దుర్వాసన వస్తుండడతో దిలీప్, జయదేవ్ రూ.20 వేలు ఖర్చు చేసి వినియోగంలోకి తీసుకువచ్చారు.

టీడీపీ విజయానికి కృషి చేయాలి

ఇచ్ఛాపురం: బీజేపీ-టీడీపీ-జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థి బెందాళం అశోక్ విజయానికి బీజేపీ పార్టీ శ్రేణులం తా కృషి చేయాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ బుద్దాల నిర్మలారెడ్డి కోరారు. సోమవారం ఇచ్ఛాపురంలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆశి సత్యంరెడ్డి, రాంమూర్తి, తులసీరావు పాల్గొన్నారు.

కూర్మనాథుని డోలోత్సవానికి ఆహ్వానం

శ్రీకాకుళం రూరల్: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీకూర్మంలోని కూర్మనాథుని దేవస్థానంలో జరిగే డోలోత్సవానికి రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావును ఆలయ పాలక మండలి సభ్యులు ఆహ్వానించారు. ఈ మేరకు మంత్రి ధర్మానను పెద్దపాడులోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలుసుకుని మంత్రి చేతుల మీదుగా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించే డోలోత్సవానికి మంత్రితో పాటు భక్తులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ ఈవో జి.గురునాథరావు, ఆలయ ప్రధానార్చకులు సీతారామాచార్యులు, అర్చకులు కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు. అలాగే బలగ ప్రాంతానికి చెందిన కొమర పూరి జానకి అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఆమెకు ముఖ్యమంత్రి సహాయ నిధికి అర్జీపెట్టుకుంది. దీంతో సోమ వారం సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.45వేలు చెక్కును మంత్రి ఆమెకు అందజేశారు. అలాగే మంత్రి తన క్యాంపు కార్యాలయంలో చేనేత కార్మికులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వైసీపీ నాయకులు అంబటి శ్రీనివాసరావు, అన్నాజీరావు, పాపారావు, నీలాద్రి, గోవిందరావు, లక్ష్మణ్, నటరాజ్, వాసు పాల్గొన్నారు.

నేడు వైసీపీ ఆవిర్భావ దినోత్సవం

శ్రీకాకుళం అర్బన్: వైసీపీ ఆవిర్భావ దినోత్సవం ఈ నెల 12వ తేదీన మంగళవారం నిర్వహించనున్నట్టు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో ఆ రోజున ఉదయం 9 గంటలకు పార్టీ పతాకావిష్కరణ, కేక్ కటింగ్, భవిష్యత్ కార్యాచరణపై సమీక్ష ఉంటుందన్నారు.

మోదీతోనే దేశాభివృద్ధి

జి.సిగడాం: కేంద్ర ప్రభుత్వ హయాంలో ప్రధాని మోదీ నాయకత్వంలో దేశాభివృద్ధి సాధ్యమని బీజేపీ మండల అధ్యక్షుడు వజ్జపర్తి రఘురాం అన్నారు. సోమవారం మండల కేంద్రంలో కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి వాటిని ప్రతీ ఒక్కరికీ వివరించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలును ప్రవేశపెట్టిందన్నారు. దేశ సంక్షేమమే మోదీ లక్ష్యమన్నారు. మూడో దఫా మోదీ ప్రధాన మంత్రి కావడం తథ్యమన్నారు. బీజేపీ, టీడీపీ, జనసేన పొత్తు విజయానికి సంకేతమన్నారు. గ్రామాల్లో పార్టీ బలోపేతానికి ప్రతీ ఒక్కరూ కృషిచేయాలన్నారు. సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి మీసాల రామకృష్ణ, పొగిరి దాశరథి పాల్గొన్నారు.

18 నుంచి మగ్గం వర్క్‌పై శిక్షణ

ఎచ్చెర్ల: స్థానిక మండల కాంప్లెక్స్ రోడ్‌లోని యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థలో మహిళలకు ఈ నెల 18వ తేదీ నుంచి మగ్గం వర్క్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు సంస్థ డైరెక్టర్ కల్లూరి శ్రీనివాసరావు తెలిపారు. ఈ జిల్లాకు చెంది 19 నుంచి 45 ఏళ్లలోపు గల గ్రామీణ ప్రాంత మహిళలు ఈ శిక్షణలో చేరేందుకు అర్హులని చెప్పారు. ఈ శిక్షణా తరగతుల్లో బ్లౌజ్, డ్రస్ డిజైన్స్, శారీ పెయింటిగ్స్ నేర్పిస్తామన్నారు. 30 రోజులపాటు ఇచ్చే ఈ శిక్షణలో ఉచిత భోజన, వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. మిగతా సమచారానికి 95534 10809, 79933 40407 ఫోన్ నెంబర్లులో సంప్రదించాలన్నారు.

వేలం పాటలు వాయిదా

పొందూరు: పొందూరులో సోమవారం సర్కారు పాటకు అనుగుణంగా టెండర్లు రాకపోవడంతో వేలం పాట వాయిదా వేసినట్లు ఈవోపీఆర్డీ పి. సింహాచలం, ఈవో ఎస్.రమేష్ తెలిపారు. పొందూరు సర్పంచ్ ఆర్.లక్ష్మి ఆధ్వర్యంలో మార్కెట్, కబేళా, కారుపార్కింగ్‌కు వేలంపాట నిర్వహించారు. పాటలో పాల్గొన్నవారు సర్కారుపాట కన్నా తక్కువగా కోట్ చేయడంతో పాటను వాయిదా వేశారు. మార్కెట్ ఆశీలపాటను రూ.8.60 లక్షలుగా సూచించగా కేవలం రూ.8 లక్షలకు మాత్రమే టెండరు వేశారు.

అర్హులను క్రమబద్ధీకరించాలి

పొందూరు: రాష్ట్రప్రభుత్వం కాంట్రాక్ట్ ఉద్యోగులు క్రమబద్ధీకరణలో భాగంగా ఆరోగ్యశాఖలో క్రమబద్ధీకరణ ప్రక్రియలో అర్హులైన ఎంపీహెచ్ఏ(మేల్)లకు అన్యాయం జరుగుతోందని జిల్లా ఎంపీహెచ్ఏ ప్రభుత్వ శిక్షణా అభ్యర్థుల సంఘం అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు బి.మురళి, జి.రమేష్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తక్షణమే విచారణ జరిపి అనర్హులను తొలగించి అర్హులను మాత్రమే క్రమబద్ధీకరించి న్యాయం చేయాలని కోరారు. ప్రైవేటు సంస్థల నుంచి సర్టిఫికెట్లను అక్రమంగా పొంది అక్రమమార్గంలో ఉద్యోగాలు పొందినవారికి ప్రాధాన్యతనిస్తుండడంతో నిజమైన అర్హులకు తీవ్ర అన్యాయం జరుగుతోంద ని తెలిపారు. ఈ విషయాన్ని ఇప్పటికే వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ దృష్టికి తీసుకువెళ్లామని పేర్కొన్నారు.

కొళాయిలు ప్రారంభం

ఆమదాలవలస: నెల్లిపర్తిలో జలజీవన్‌మిషన్ ద్వారా ఇంటింటికి మం చినీటి కొళాయిలను సోమవారం స్పీకర్ తమ్మినేని సీతారాం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ తమ్మినేని శ్రీరామ్మూర్తి, పీఏసీఎస్ అధ్యక్షుడు గరుగుబిల్లి శ్రీనివాసరావు, మండల సచివాలయాల కో-ఆర్డినేటర్ బొడ్డేపల్లి నిరంజన్‌బాబు పాల్గొన్నారు.